క్లుప్తంగా

పాఠ్య పుస్తకాలు మంజూరు


పుస్తకాలను పరిశీలిస్తున్న ఏంఈఓ నాగార్జునరెడ్డి

శిరివెళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాల మంజూరు కొనసాగుతుంది. సోమవారం 1–10వ తరగతి వరకు 18వేల పుస్తకాలు మంజూరయ్యాయి. వాటిని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల స్టాక్ కేంద్రంలో నిల్వ చేశారు. ఎంఈఓ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఇంతవరకు మండలానికి 37 వేల పాఠ్య పుస్తకాలు, 30 వేల నోట్ పుస్తకాలు, 3,086 బెల్టులు మంజూరయ్యాయని చెప్పారు.

ఏకధాటిగా కురిసిన వర్షం


రుద్రవరంలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

రుద్రవరం: మండలంలో సోమవారం ఎడ తెరపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం 10 గంటల నుంచి మొదలై సాయంత్రం 5 గంటల వరకు కురిసింది. దీంతో పలు కాలనీలు జల మయమయ్యాయి. ప్రధాన రహదారులపై వర్షపు నీరు భారీగా ప్రవహించింది. పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఇప్పటికే సాగు చేసిన మొక్కజొన్న,మినుము వంటి పంటలు నీట మునిగాయి. అయితే పొలాల్లో నీరు అలాగే నిలిచి ఉంటే సాగు చేసిన పంటలు దెబ్బతింటాయని రైతులు నీటిని బయటకు పంపే పనులు చేపట్టారు.

చిన్నారులకు బంగారు భవిష్యత్


బుర్రారెడ్డిపల్లెలో అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ

దొర్నిపాడు: మూడేళ్లు నిండిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ తెలిపారు. సోమవారం బుర్రారెడ్డిపల్లె గ్రామంలో అంగన్‌వాడీ బడిబాటలో భాగంగా చిన్నారులు, తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు మంచి పౌష్టికాహారం లభించడంతో పాటు ఆట పాటలతో కూడిన విద్యను బోధిస్తారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త మాధవీ పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతి


మృతుడి భార్యకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న తహసీల్దారు

రుద్రవరం: ముత్తలూరు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ పీర్‌బై (47)అనారోగ్య కారణంగా సోమవారం మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు.చికిత్స పొందుతున్నప్పటికీ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య పీరమ్మ, కుమారుడు,కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు మురళీమోహన్ గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ.15వేల నగదును మృతుడి భార్యకు అందజేశారు. అలాగే వీఆర్‌ఏలు హుసేని,ఓబులేసు,శీను, నరసింహ తదితరులు సంఘం తరపున నివాళులర్పించి రూ.5వేలు అందజేశారు.

కుక్కల దాడిలో జింకపిల్లకు గాయాలు


జింకకు వైద్యం చేస్తున్న దృశ్యం

మహానంది: శిరివెళ్ల మండలం గోవిందపల్లిలో వీధి కుక్కలు జింక పిల్లపై దాడి చేయడంతో గాయపడింది. విషయం తెలుసుకున్న పోలీసులు జింకను పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. చికిత్స నిమిత్తం అటవీశాఖ సిబ్బంది గాజులపల్లె పశు సంచార వాహనం దగ్గరకు తీసుకొచ్చి ఇంజక్షన్లు వేయించారు. జింక పిల్ల ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం అడవిలో వదిలిపెడతామని కోటకొండ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామేశ్వరి తెలిపారు.

ఘనంగా జాతర

పాణ్యం: సుగాలిమెట్ట గ్రామంలో వెలసిన సంత్ సేవాలాల్ మహరాజ్ మారెమ్మ జాతర సందర్భంగా సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు.

భవితకు పునాది

ఉన్నత స్థానాల్లో స్థిరపడాలంటే ప్రస్తుతం పాఠ్యాంశాలపై పట్టు మాత్రమే కాదు.. అనుబంధ అంశాలు, సాంకేతికతపై కనీస అవగాహన, నైపుణ్యం అవసరం. సాధారణ వేళల్లో విద్యాలయాలకు వెళ్తూ వీటిలోనూ శిక్షణ పొందాలంటే కొంత మేర కష్టమే. అయితే వేసవి సెలవులు ఇందుకు అనువైనవి. వీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు పలువురు విద్యార్థులు. ప్రస్తుతం ఆదరణ పొందుతున్న కోర్సులు, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉండే వాటిలో శిక్షణ పొందుతున్నారు. ముఖ్యంగా ఐటీ ఆధారిత కోర్సుల్లో స్వల్ప కాలిక శిక్షణకు ఆసక్తి చూపుతున్నారు. శిక్షకులతో పట్టణంలోని పలు కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి.


నంద్యాల పట్టణంలో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

- సెలవుల్లో కంప్యూటర్ శిక్షణపై విద్యార్థుల ఆసక్తి
- సరికొత్త కోర్సుల వైపే మొగ్గు
- స్వల్పకాలిక కోర్సులపై ప్రత్యేక దృష్టి

నంద్యాల(న్యూటౌన్): వేసవి సెలవులను అధిక శాతం విద్యార్థులు సమర్థంగా వినియోగించుకుంటున్నారు. చాలా మంది విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల్లో చేరి భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకునేందుకు ఇప్పటి నుంచే శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో మంచి ప్రతిభ కనబర్చడానికి కంప్యూటర్ శిక్షణా కేంద్రాల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులను ఆకర్షించేందుకు శిక్షణ కేంద్రాల నిర్వాహకులు వివిధ కోర్సులపై ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 30 కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు ఉన్నాయి.

వివిధ కోర్సులు...

శిక్షణ కేంద్రాల్లో కంప్యూటర్‌కు సంబంధించి ప్రాథమిక అంశాలతో పాటు, సీసీఏ, డీసీఏ, పీజీడీసీఏ, జావా, సీ లాంగ్వేజ్, టాలీ, ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, ఇంటర్నెట్, హార్డ్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో కంప్యూటర్ విద్యపై పరిజ్ఞానం పెంచుకుంటే ఉన్నత విద్యలో విద్యార్థులు మంచి ప్రతిభ చూపుతారని తల్లిదండ్రులు కూడా పిల్లలకు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. అలాగే వివిధ పోటీ పరీక్షలకు కూడా శిక్షణ పొందుతున్నారు.

నామమాత్రపు ఫీజుతో..

ఖాళీ సమయంలో వస్తున్న విద్యార్థుల కోసం పలు కంప్యూటర్ శిక్షణ సంస్థలు తక్కువ ఫీజులతోనే బోధన చేస్తున్నాయి. ప్రాథమిక అంశాలకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు, ఎంఎస్ ఆఫీస్, పీజీడీసీఏ లాంటి కోర్సులకు రూ.2,500 నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వంతో ఒప్పందం మేరకు కొన్ని సంస్థలు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచితంగానే శిక్షణ ఇస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 5వేల మంది విద్యార్థులు కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందుతున్నారు.

ఉన్నత ప్రమాణాలు పెంచుకునేందుకు



భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకునేందుకు కంప్యూటర్ శిక్షణ పొందుతున్నా. ఉద్యోగం కోసం తీవ్ర పోటీ నెలకొన్న సమయంలో కంప్యూటర్ శిక్షణ చాలా అవసరం. అందుకే ముందస్తుగా ప్రాథమిక అంశాలతో పాటు పలు కోర్సుల్లో శిక్షణ తీసుకుంటున్నా. ఇప్పటి నుంచే వాటిపై అవగాహన ఉంటే చదువు పూర్తయ్యే లోపు కెరియర్‌లో స్థిరపడవచ్చు.

– సంధ్య, నంద్యాల

కంప్యూటర్ కోర్సుపై ఆసక్తితో..



పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఉన్నత విద్యతో పాటు, కంప్యూటర్ శిక్షణ పొందుతున్నాను. సెలవుల్లో కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందితే మంచి ఫలితాలు సాధించవచ్చు. ముఖ్యంగా పాఠ్యాంశాలకు అనుబంధంగా ఉండే అంశాల్లో శిక్షణ పొందితే కంపెనీలు త్వరగా ఉద్యోగాలను కల్పిస్తాయి. అందుకే ముందస్తుగా పలు కోర్సుల్లో శిక్షణ తీసుకుంటున్నా.

–మాధవి, నంద్యాల

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

శిరివెళ్ల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణలత సోమవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో చిన్నారుల హాజరు పట్టిక, పోషకాహార పదార్థాల నిల్వల రిజిష్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి అంగన్‌వాడీ బాట కార్యక్రమం మొదలైందన్నారు. 14వ తేదీ వరకు చిన్నారులను కేంద్రాల్లో చేర్పించేందుకు కార్యకర్తలు తల్లిదండ్రులను ప్రోత్సహిస్తారన్నారు. ఇంత వరకు 60 మంది చిన్నారులను కేంద్రాల్లో చేర్పించారని చెప్పారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయండి

నంద్యాల(సిటీ): పట్టణ పరిధిలో ఏవైనా సమస్యలు తలెత్తితే కమాండ్ కంట్రోల్ రూముకు ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా పట్టణంలో పైప్ లైన్ ధ్వంసమై కలుషిత నీరు ప్రవహించడం, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగడం, కల్వర్టుల నుంచి నీరు రోడ్ల పైన ప్రవహించడం, రోడ్లపై గుంతలు పడినా, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సమస్యలు ఉంటే మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం సెల్ 7702776048 నంబర్‌కు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 8.30 గంటల లోపు తెలియజేయాలని పేర్కొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

బొమ్మలసత్రం: పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి అనివార్యమని, ఉద్యోగ బాధ్యతల అనంతరం ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో హోంగార్డు పీవీడీ ప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రసాద్ హోంగార్డ్ గా 1982లో విధుల్లో చేరి నంద్యాల సబ్ డివిజన్‌లోని పలు పోలీస్ స్టేషన్లతో పాటు శ్రీశైలం ,మహానంది టెంపుల్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారన్నారు. సుదీర్ఘ కాలం క్రమశిక్షణ, బాధ్యతయుతంగా విధులు నిర్వహించి పదవీ వీరమణ పొందడం అభినందనీయమన్నారు. మనమంతా ఒకే కుటుంబమని, పదవీ విరమణ పొందిన అనంతరం ఏమైనా సమస్యలుంటే నేరుగా తనని సంప్రదించవచ్చని, తోడ్పాటును అందిస్తానని హామీనిచ్చారు. అనంతరం ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీపీఓ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నిజాముద్దీన్, సీసీ నాగరాజు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, హోంగార్డు ఇన్‌చార్జ్ జమాల్, సిబ్బంది రవి కుమార్ ,బొబ్బిలి, నరసింహులు, మేరి పాల్గొన్నారు.


హోంగార్డు ప్రసాద్‌ను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావినూతల దుర్గాప్రసాద్, కార్యదర్శి భూపని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం కోర్టు ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేసి న్యాయవాదుల న్యాయమైన కోరికలను తీర్చాలని, స్టేషన్ బెయిల్‌ను రద్దు చేసి కోర్టులే బెయిల్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే కోర్టుల్లో ఖాళీగా ఉన్న జడ్జి పోస్టులను, సిబ్బంది కొరతను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరిరెడ్డి, శ్రీదేవి, అమర్నాథ రెడ్డి, వెంకటేశ్వర్లు, పీడీహెచ్‌బాబు, రమణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

- గొర్రెల కోసం బంధువుల మధ్య వాగ్వాదం
- ఫిర్యాదు మేరకు తండ్రిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు
- మనస్థాపంతో ఉరేసుకొని ఆత్మహత్య

చాగలమర్రి: మండలంలోని తోడేండ్లపల్లె గ్రామంలో బంధువుల మధ్య జరిగిన వాగ్వాదం, దూషణలతో మనస్థాపం చెందిన పల్లపు భాగ్యలక్ష్మి (28) ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మంజుల సుహాసిని, మంజుల చిన్న సొడన్న ఆదివారం గొర్రెల విషయంలో భాగ్యలక్ష్మి ఆమె తల్లిదండ్రులైన చౌడేశ్వరి, జయన్న మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో భాగ్యలక్ష్మితో పాటు ఆమె తల్లిదండ్రులు తమను దూషించడంతో పాటు చంపుతామని బెదిరించారని సొడన్న ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతురాలి తండ్రి జయనన్నను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు సోమవారం తీసుకెళ్లారు. అదే సమయంలో తల్లి చౌడేశ్వరి పొలం పనులకు వెళ్లింది. దీంతో మనస్థాపం చెందిన భాగ్యలక్ష్మి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చాగలమర్రి నుంచి ఇంటికి వచ్చిన జయన్న కుమార్తె ఉరికి వేలాడుతుండటాన్ని చూసి బోరున విలపించాడు. తనను, తల్లిదండ్రులను దూషించడంతో తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని జయన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. మృతురాలు పదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లింది. మూడు నెలల క్రితం తిరిగి వచ్చి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది.

12,13న ఎద్దుల బండలాగుడు పోటీలు


ముస్తాబైన కట్ట మీది స్వామి దర్గా

చాగలమర్రి: స్థానిక చెరువు కట్టపై వెలసిన శ్రీదస్తగిరి స్వామి గంధం, ఉరుసును ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. 12న గంధం, 13న ఉరుసు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 12వ తేదీన ఒంటెద్దు బండలాగుడు, 13న సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఒంటెద్దు బండలాగుడు పందెం పోటీలు ఉదయం 8.00 గంటలకు ప్రారంభం అవుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఉదయం రూ.300ల ప్రవేశ రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ. 3వేలు, రూ.2,500, రూ.2వేలు, రూ.వెయ్యి దాతల సహకారంతో అందజేస్తామన్నారు. అలాగే 13వ తేదీ ఉదయం 8.00 గంటలకు సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయని అదే రోజు ఉదయం ప్రవేశ రుసుము రూ.600 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు ప్రకటించినట్లు కమిటీ సభ్యులు వివరించారు. వివరాలకు సెల్ : 9912786137, 9640918230, 9381719968 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, నగరి శ్రీనివాసులు, రాష్ట్ర అడహక్ కమిటీ సభ్యులు సాంబశివుడు కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన జీవో నంబరు 117ను తక్షణమే రద్దు చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, వివిధ రకాల యాప్‌లను రద్దు చేసి ఉపాధ్యాయులను కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. మునిస్వామి, పుల్లయ్య, రవి, పవన్‌కుమార్, ప్రతాపరెడ్డి, వెంకటరమణ, రామాంజనేయులు, మద్దిలేటి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసులు

రాయమాల్పురంలో శిలాఫలకాలు ధ్వంసం

- గ్రామంలో పోలీసుల విచారణ


పడిపోయిన టీడీపీ శిలాఫలకం


టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన శిలాఫలకం

నంద్యాల(అర్బన్): మండలంలోని రాయమాల్పురం గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు ధ్వంసం అయ్యాయి. వైఎస్సార్‌సీపీ, టీడీపీకి చెందిన శిలాఫలకాలు ధ్వంసం కావడంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. శిలాఫలకాల ధ్వంసంపై పంచాయతీ కార్యదర్శి విశ్వనాథరెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాయమాల్పురం నుంచి పులిమద్దికి వెళ్లే రహదారిలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రి హోదాలో నాడు శిల్పామోహన్‌రెడ్డి ఈద్గా ఏర్పాటుకు 50 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. అదే ప్రాంతంలో 2019లో ఈద్గా నిర్మాణానికి నిధులు తెప్పిస్తామంటూ ఎమ్మెల్సీగా ఉన్న ఎస్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పేరుతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. శిలాఫలకం గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో 20 రోజుల క్రితం కురిసిన వర్షాలకు పడిపోయింది. ఇటీవల గ్రామానికి చెందిన ఇద్దరు కంప చెట్లు తొలగిస్తుండగా శిలాఫలకం పడిపోయి ఉండటాన్ని గమనించారు. విషయం గ్రామ టీడీపీ నాయకులకు తెలియడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వంసం చేశారంటూ సోమవారం ఉదయం గ్రామ సచివాలయం వద్ద ఉన్న శిలాఫలకం, రహదారి పక్కనున్న శిలాఫలకాలను ధ్వంసం చేయడంతో ఒక్కసారిగా గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు రంగప్రవేశం చేశారు.

అలజడులు సృష్టించేందుకే..

ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అలజడులు సృష్టించేందుకే టీడీపీ నాయకులు శిలాఫలకాల ధ్వంసానికి పాల్పడుతున్నారని ఎంపీపీ శెట్టిప్రభాకర్, నాయకులు ఎస్ఎం బాషా, పూలశీను, ఎర్రహుసేని తెలిపారు. ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఉన్న ఐదేళ్లలో చిన్న సంఘటన కూడా చోటు చేసుకోలేదని, గ్రామం ప్రశాంతతకు మారుపేరు ఉండిందని చెప్పారు. అధికారంలోకి రాకముందే టీడీపీ నాయకులు.. వైఎస్సార్‌సీపీ నాయకులను హేళన చేయడం, రెచ్చగొట్టడం లాంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. చేతనైతే గ్రామాభివృద్ధికి తోడ్పడాలని, ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టొద్దని హితవు పలికారు.


గ్రామంలో విచారిస్తున్న పోలీసులు

మెగా డీఎస్సీ హామీ నెరవేర్చాలి

నంద్యాల(న్యూటౌన్): మెగా డీఎస్సీ హామీని నెరవేర్చాలని డీవైఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌కుమార్, మాజీ ఉపాధ్యక్షుడు నరసింహులు కోరారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో డీవైఎఫ్‌ఐ కార్యదర్శి శివ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇందుకు ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకట్ పాల్గొన్నారు.

నివాళి

నంద్యాల(న్యూటౌన్): స్థానిక సీపీఎం కార్యాలయంలో పర్స సత్యనారాయణ జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మస్తాన్‌వలి, రామరాజు పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ సత్యనారాయణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రజుమంలో తోటమద్దులు, గౌస్, బాలవెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్దీపాలంకరణలో ప్రభుత్వ కార్యాలయాలు

రుద్రవరం: ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్త ప్రభుత్వాన్ని స్వాగతిస్తూ స్థానిక తహసీల్దారు కార్యాలయం, వ్యవసాయ, ఎమ్మార్సీ కార్యాలయాలను ఆయా శాఖల ఉద్యోగులు సోమవారం విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ విషయంపై ఆయా శాఖల ఉద్యోగులను ప్రశ్నించగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయాలను ముస్తాబు చేసినట్లు తెలిపారు.

అలరించిన భజన కార్యక్రమం



భజన కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా సోమవారం ఎస్ పెద్దపుల్లమ్మ బృందం, మహానంది, నంద్యాల జిల్లా వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయక దేవగణేశ, శ్రీశైలం శివమయం, శివశివయనరాదా. మనసారా నిన్నే కొలచితిని, శ్రీమల్లికార్జున దయచూపరా, శివనామమంత్రం, ఓం నమ:శివాయ, అమ్మపరమేశ్వరి, శంభో... శివశంభో, శ్రీశైలం శివమయం తదితర భక్తిగీతాలు, అష్టకాలను ఎస్. పెద్దపుల్లమ్మ. ఎస్. రంగయ్య, ఆర్. ముకుందరావు, ఎం.ప్రతాప్, టి. నవీన్ కుమార్, రామేశ్వరరెడ్డి, తదితరులు ఆలపించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

బనగానపల్లె: రైతులు యాజమన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కేవీకే సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జి.ధనలక్ష్మి అన్నారు. సోమవారం బనగానపల్లె మండలం యాగంటిపల్లె గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వంటనూనెలు అధికంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. దీన్ని అధిగమించేందుకు నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సంమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నూనె గింజల సాగును ప్రోత్సహిస్తోందని చెప్పారు. నాణ్యమైన విత్తనం 25 శాతం వరకు దిగుబడులకు కారణమన్నారు. మేలైన యాజమన్య పద్ధతులను పాటించి ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. సోయా చిక్కుడులో ఎరువుల యామాన్య పద్ధతులను వివరించారు. ఎండుతెగుళ్ల, వేరుతెగుళ్ల, తెల్లతెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో భూ విజ్ఞాన శాస్త్రవేత్త రమణయ్య, సస్య రక్షణ శాస్త్రవేత్త బాలరాజు, సేద్య విభాగ శాస్త్రవేత్త సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లడుతున్న శాస్త్రవేత్త ధనలక్ష్మి

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత శర్మ, ఆంజనేయ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార హారతులిచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు చేశారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.


పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

యాగంటిలో ఘనంగా పల్లకీ మహోత్సవం


పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటిలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రదోషకాల పూజలు చేశారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో నంది మండపం వరకు తీసుకెళ్లారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.